సాక్షి కామారెడ్డి

బుధవారం, 25, సెప్టెంబర్, 2024



విధుల్లో నిర్లక్ష్యాన్ని సహించం

విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను హెచ్చరించారు.

- 8లో ▸



మహిళలే కీలకం

దేశాభివృద్ధిలో మహిళలది కీలక పాత్ర అని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
38.5 /22.5

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

బడిలో కీచకులు!



జీవదాన్ పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నేతలు, విద్యార్థుల తల్లిదండ్రులు

చిన్నారులతో అసభ్య ప్రవర్తన

- బ్యాడ్ టచ్‌తోపాటు లైంగిక వేధింపులు
- ఏడాదిన్నరలో పది కేసులు నమోదు
- పోక్సో కేసులకూ వెరవని మృగాళ్లు
- పిల్లలను బడికి పంపాలంటేనే భయపడే పరిస్థితి

తల్లి ఒడి నుంచి బడికి చేరిన చిన్నారికి భద్రత కరువైంది. కన్నబిడ్డల్లా చూసుకోవాల్సిన ఉపాధ్యాయులే బాధ్యత మరచి, వేధింపులకు పాల్పడుతున్నారు. చిన్నారులపై అఘాయిత్యాలకు ఒడిగడుతున్నారు. పోక్సోలాంటి కఠిన చట్టాలు వచ్చినా మృగాళ్ల వేధింపులు ఆగకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : పాఠశాలల్లో ఆడపిల్లలకు భద్రత కరువవుతోంది. చాలాచోట్ల పిల్లలు బ్యాడ్ టచ్ సమస్యను ఎదుర్కొంటున్నారు. మరికొన్నిచోట్ల లైంగిక దాడులకూ గురవుతున్నారు. దీంతో పిల్లల తల్లిదండ్రుల్లో ఒక రకమైన భయం ఏర్పడుతోంది. జిల్లాలో ఏడాదిన్నర కాలంలో పాఠశాలల్లో విద్యార్థులతో అసభ్యకరంగా వ్యవహరించడం, అఘాయిత్యాలకు పాల్పడడం వంటి సంఘటనలకు సంబంధించి పది పోక్సో కేసులు నమోదయ్యాయి. తాజాగా జిల్లా కేంద్రంలోని ప్రైవేటు పాఠశాలలో ఆరేళ్ల చిన్నారిపై పీఈటీ అసభ్యకరంగా ప్రవర్తించిన సంఘటన మంగళవారం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది.

విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం

మండల, జిల్లా విద్యాశాఖ అధికారులు స్కూళ్లను పర్యవేక్షించకపోవడంతో పాలన గాడి తప్పింది. ఉపాధ్యాయులపై సరైన అజమాయిషీ లేకపోవడంతో పలువురు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ విద్యా వ్యవస్థకు మచ్చ తెస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులపై ఆరోపణలు, ఫిర్యాదులు వచ్చినపుడు వెంటనే చర్యలు తీసుకోకుండా వాళ్లతో లాలూచీ పడుతున్నారన్న ఆరోపణలున్నాయి. అలాగే ప్రైవేటు స్కూళ్లపై ఫిర్యాదులు వచ్చినపుడు యాజమాన్యాలతో మాట్లాడి ఫిర్యాదులను పరిష్కరించే ప్రయత్నం చేయడం లేదన్న విమర్శలున్నాయి. జిల్లా కేంద్రంలోని ప్రైవేటు పాఠశాలలో ఆరేళ్ల చిన్నారిపై పీఈటీ అసభ్యకరంగా ప్రవర్తించిన సంఘటనకు వ్యతిరేకంగా ఆందోళనల్లో పాల్గొన్న చాలామంది.. పాఠశాల యాజమాన్యం మూలంగా తాము పడుతున్న ఇబ్బందులపై విద్యాశాఖ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించడం గమనార్హం. విద్యార్థి సంఘాలు కూడా ఇవే ఆరోపణలు చేస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యాశాఖను గాడిలో పెట్టాలని విద్యార్థి సంఘాల నేతలు కోరుతున్నారు.



ఆందోళనకారులనుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ సింధు శర్మ

- గతేడాది జనవరి 12న సదాశివనగర్ పోలీస్ స్టేషన్‌లో ఓ ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదైంది. అదే ఏడాది మార్చి 4న గాంధారి మండలంలో ఓ ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు పెట్టారు.
- ఈ ఏడాది ఫిబ్రవరి 21న నిజాంసాగర్ మండలంలోని ఓ గురుకుల పాఠశాలలో బాలుడితో ఓ ఉపాధ్యాయుడు అసభ్యకరంగా వ్యవహరించాడు. ఈ సంఘటనపై పోక్సో కేసు నమోదైంది.
- మార్చి 22న నాగిరెడ్డిపేట మండలంలో ఇద్దరు విద్యార్థినులతో అసభ్యకరంగా వ్యవహరించిన సంఘటనలో ఉపాధ్యాయుడిపై రెండు పోక్సో కేసులు నమోదయ్యాయి. ఇందులో ఒక ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు కూడా ఉంది.

టీచర్లపై పోక్సో కేసుల వివరాలు..

- ఏప్రిల్ 3న లింగంపేట మండలంలో ఓ ఉపాధ్యాయుడు ఇద్దరు విద్యార్థినులతో అనుచితంగా ప్రవర్తించాడు. ఈ వ్యవహారంలో అతడిపై రెండు పోక్సో కేసులు నమోదయ్యాయి.
- జూలై 10న బాన్సువాడ మండలంలో విద్యార్థినితో అసభ్యకరంగా ప్రవర్తించిన సంఘటనలో ఉపాధ్యాయుడిపై కేసు నమోదైంది. విషయం బయటకు పొక్కకుండా ప్రయత్నించిన తొమ్మిది మంది గ్రామ పెద్దలపైనా కేసులు పెట్టారు.
- కామారెడ్డి పట్టణంలో ఇటీవల స్వచ్ఛంద సంస్థలో పనిచేసే ఒకరు ఇంటర్ విద్యార్థిని ఫీజు విషయంలో సాయం చేస్తానని చెప్పి లైంగికంగా వేధించే ప్రయత్నం చేశాడు. దీంతో అతడిపై పోక్సో కేసు పెట్టి, పోలీసులు అరెస్టు చేశారు.
- తాజాగా జిల్లాకేంద్రంలోని ప్రైవేటు పాఠశాలలో ఆరేళ్ల చిన్నారిపై ఆ పాఠశాలలో పనిచేస్తున్న పీఈటీ అసభ్యకరంగా వ్యవహరించిన సంఘటన జిల్లా కేంద్రంలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఇలా పాఠశాలల్లో జరుగుతున్న వరుస సంఘటనలు సమాజాన్ని ఆందోళనకు గురిచేస్తున్నాయి. చాలా స్కూళ్లలో విద్యార్థినులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరు అమ్మాయిలను ఏదోరకంగా తాకే ప్రయత్నం చేసిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. అయితే చాలామంది బయటకు చెప్పుకోలేక తమలో తామే కుంగిపోతున్నారు.



జీవదాన్ స్కూల్ వద్ద ఆందోళన చేస్తున్న బల్దియా చైర్‌పర్సన్ ఇందుప్రియ, విద్యార్థి సంఘాల నేతలు

జీవదాన్‌లో రణరంగం

పాఠశాలను ముట్టడించిన విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు

రాళ్ల దాడి చేసిన ఆందోళనకారులు.. లాఠీచార్జి చేసిన పోలీసులు

సీఐతో పాటు పలువురికి గాయాలు

కామారెడ్డి టౌన్/కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ రోడ్‌లో ఉన్న జీవదాన్ పాఠశాలలో యూకేజీ చదువుతున్న ఆరేళ్ల చిన్నారిపై పీఈటీ అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటన తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. బాధితుల ఫిర్యాదుల మేరకు పట్టణ పోలీసులు సోమవారం పోక్సో కేసు నమోదుచేసి, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం ఉదయం ఏబీవీపీ, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, బీవీఎం తదితర విద్యార్థి సంఘాల ప్రతినిధులు పాఠశాలకు చేరుకుని ఆందోళనకు దిగారు. ప్రిన్సిపాల్ శ్యాం కురియన్, వైస్ ప్రిన్సిపాల్ వీసీ థామస్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పాఠశాల లోపలికి దూసుకెళ్లారు. ప్రిన్సిపాల్ చాంబర్‌లో ఫర్నిచర్ ధ్వంసం చేసి, పాఠశాలకు తాళం వేసేందుకు యత్నించారు.

విద్యాశాఖ తీరుపై ఆగ్రహం..

జీవదాన్ పాఠశాల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నా డీఈవో రాజు, ఎంఈవో ఎల్లయ్య పట్టించుకోవడం లేదంటూ విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు. పాఠశాల పీఈటీపై పలుమార్లు ఫిర్యాదు చేసినా యాజమాన్యం కాని, విద్యాశాఖ అధికారులుగానీ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈ వ్యవహారంలో పాఠశాల యాజమాన్యంతోపాటు డీఈవో, ఎంఈవోలపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆందోళనకు మద్దతు

మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, స్థానిక నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేస్తున్న వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ డీఈవోతో ఫోన్‌లో మాట్లాడారు. సంఘటన స్థలానికి వచ్చి ఆందోళనకారులకు సమాధానం ఇవ్వాలన్నారు. నిందితుడికి శిక్షపడేలా చూడాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

పోలీసులకు గాయాలు

ఆందోళనకారుల రాళ్ల దాడిలో పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తలకు తీవ్ర గాయమైంది. ఆయనను వెంటనే ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ అమీనుద్దీన్ కుడికాలు విరిగింది. మరో పదిమంది పోలీసులకు గాయాలయ్యాయి. పట్టణ ఎస్సై రాజారాం సొమ్మసిల్లి పడిపోవడంతో ఆస్పత్రికి తరలించారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్పీ సింధు శర్మ, ఏఎస్పీ నర్సింహారెడ్డితో పాటు పలువురు ఉన్నతాధికారులు ఘటన స్థలానికి చేరుకుని ఆందోళకారులను సముదాయించారు. ఈ సందర్భంగా ఎస్పీ సింధు శర్మ మాట్లాడుతూ నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. అయినా ఆందోళనకారులు ఆందోళన విరమించకపోవడంతో పోలీసులు బలవంతంగా అక్కడి నుంచి పంపించివేశారు. పట్టణ పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకుని అక్కడ ఆందోళన కొనసాగించేందుకు యత్నించిన వారిపై మరోసారి పోలీసులు లాఠీలు ఝుళిపించారు. జీవదాన్ పాఠశాలతోపాటు ప్రధాన కూడళ్ల వద్ద పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు.

రాళ్ల దాడితో ఉద్రిక్తత

పోలీసులు పరిస్థితిని అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో అక్కడికి వచ్చిన యువకులు.. పాఠశాలలోనికి చొచ్చుకు వెళ్లేందుకు యత్నించారు. ఈ క్రమంలో పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య తోపులాట జరిగింది. కొందరు పాఠశాల భవనంపై రాళ్లు రువ్వడంతో కిటికీలు, అద్దాలు ధ్వంసమయ్యాయి. పోలీసులపైనా రాళ్లు పడడంతో పరిస్థితి అదుపు తప్పింది. దీంతో పోలీసులు తమ లాఠీలకు పని చెప్పి ఆందోళనకారులను చెదరగొట్టారు. పరిస్థితిని గమనించి జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్‌లతో పాటు చుట్టు పక్కల జిల్లాలకు సంబంధించిన అదనపు పోలీసు బలగాలను కామారెడ్డికి రప్పించారు.



ఎస్సై రాజారాంను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

న్యూస్‌రీల్

నిజాంసాగర్‌లోకి 10 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

నిజాంసాగర్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో నిజాంసాగర్ ప్రాజెక్టులోకి మంగళవారం 10,105 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని నీటిపారుదలశాఖ ఏఈ శివప్రసాద్ తెలిపారు. దీంతో ప్రాజెక్టు రెండు వరద గేట్లను ఎత్తి 8,100 క్యూసెక్కుల నీటిని మంజీరలోకి విడుదల చేస్తున్నామన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు(17.8 టీఎంసీలు) కాగా మంగళవారం సాయంత్రానికి 1404.93 అడుగుల (17.701 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.

కౌలాస్ గేటు ద్వారా..

జుక్కల్ మండలంలోని కౌలాస్ ప్రాజెక్టులోకి 671 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని ప్రాజెక్టు ఏఈ రవిశంకర్ తెలిపారు. దీంతో ప్రాజెక్టు ఒక గేటును ఎత్తి 571 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నామన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 458 మీటర్లు (1.237 టీఎంసీ) కాగా ప్రస్తుతం 457.95 మీటర్ల (1.225 టీఎంసీ) నీరుంది.

ఆస్పత్రిలో ఇంటర్‌నెట్ సేవల పునరుద్ధరణ

సాక్షి ఎఫెక్ట్..

కామారెడ్డి టౌన్: కామారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఇంటర్‌నెట్ సేవలను పునరుద్ధరించారు. 'జీజీహెచ్‌లో ఇంటర్‌నెట్ సేవలు బంద్' శీర్షికన 'సాక్షి'లో మంగళవారం ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. ఆస్పత్రి అధికారుల ఆదేశాల మేరకు సిబ్బంది వెంటనే రీచార్జి చేయించి, ఇంటర్‌నెట్ సేవలను పునరుద్ధరించారు.

'ఓటరు నమోదు సర్వే పూర్తి చేయండి'

కామారెడ్డి క్రైం: నూతన ఓటరు నమోదుకోసం చేపట్టిన ఇంటింటి సర్వేను ఈనెల 28వ తేదీలోగా పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆయన హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఇంటింటి సర్వే ఇప్పటివరకు 90 శాతానికిపైగా పూర్తయ్యిందన్నారు. ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన వారికి సంబంధించి నోటీసులు ఇచ్చి, నిర్దేశిత పద్ధతిలో జాబితాలోంచి తొలగించాలన్నారు. బీఎల్‌వో యాప్ వినియోగంపై బూత్ స్థాయి అధికారులకు అవసరమైన శిక్షణ అందించాలన్నారు. పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ, ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణలను వచ్చే నెల 29 వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. ఇంటింటి సర్వే పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో రంగనాథ్‌రావు, తహసీల్దార్లు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అధికారులు

మండల విద్యాధికారుల నియామకం

- సీనియర్ పీజీ హెడ్మాస్టర్లకు పూర్తిస్థాయి బాధ్యతలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : విద్యాశాఖను గాడిలో పెట్టడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అందులో భాగంగా ప్రతి మండలానికి ఒక విద్యాశాఖ అధికారి (ఎంఈవో) ఉండేలా చర్యలు చేపట్టింది. సీనియర్ గెజిటెడ్ హెడ్మాస్టర్‌కు పూర్తి స్థాయి ఎంఈవో బాధ్యతలు అప్పగిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్తగా ఏర్పాటైన మండలాలకూ ఎంఈవోలను నియమించింది. ఎంఈవోల రాకతో పాఠశాలల పర్యవేక్షణ మెరుగుపడుతుందని ఆశిస్తున్నారు.

ఎంఈవోల వివరాలు..

మండలం	ఎంఈవో
కామారెడ్డి	వై.ఎల్లయ్య
మాచారెడ్డి	ఎస్.దేవేందర్‌రావు
రాజంపేట	కె.పూర్ణచందర్
బీబీపేట	ఆర్.అశోక్
దోమకొండ	ఏఎస్ విజయ్‌కుమార్
పల్వంచ	ఆర్.జెతిలాల్
భిక్కనూరు	రాజగంగారెడ్డి
లింగంపేట	ఎండీ షౌకత్
సదాశివనగర్	కె.యోసెఫ్
ఎల్లారెడ్డి	ఎ.వెంకటేశం
నాగిరెడ్డిపేట	ఎస్.భాస్కర్‌రెడ్డి
తాడ్వాయి	జి.రామస్వామి
గాంధారి	వి.శ్రీహరి
రామారెడ్డి	ఎన్.ఆనందరావు
బాన్సువాడ	పి.నాగేశ్వరరావు
నస్రుల్లాబాద్	డి.చందర్
బీర్కూర్	ఎం.వెంకన్న
నిజాంసాగర్	వై.తిరుపతిరెడ్డి
మహ్మద్‌నగర్	అమర్ సింగ్
పెద్దకొడప్‌గల్	పి.ప్రవీణ్‌కుమార్
పిట్లం	కే.దేవిసింగ్
మద్నూర్	జె.రాములు
డోంగ్లీ	టి.శ్రీనివాస్
బిచ్కుంద	ఎ.శ్రీనివాస్‌రెడ్డి
జుక్కల్	టి.తిరుపతయ్య

క్లుప్తంగా

ఎయిడ్స్‌పై అవగాహన



భిక్కనూరు : మండలంలోని జంగంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వైఆర్‌కే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఎయిడ్స్ నివారణపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ డీఆర్పీ సుధాకర్ మాట్లాడుతూ తల్లికి హెచ్ఐవీ సోకితే ఆస్పత్రిలోనే కాన్పు చేయించాలన్నారు. ఎయిడ్స్ నివారణకు మందు లేదని నివారణే మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్నోవేటివ్ హబ్ ప్రారంభం



కామారెడ్డి టౌన్ : అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ దేవునిపల్లి పాఠశాలలో మినీ ఇన్నోవేటివ్ హబ్‌ను మంగళవారం డీఈవో ఎస్ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఈ మినీ ఇన్నోవేటివ్ హబ్ వల్ల విద్యార్థుల్లో రోబోటిక్, కోడింగ్ నాలెడ్జ్, క్రియేటివిటీ, 3డి ప్రింటర్ నాలెడ్జ్ , మోటార్ స్కిల్స్ ఎంతగానో పెంపొందిస్తాయని తెలిపారు. హెచ్ఎం గంగా కిషన్, అగస్త్య ఫౌండేషన్ ప్రతినిధులు వసంత్, మల్లిక, పాఠశాల ఉపాధ్యాయ బృందం శ్రీశైలం ఉన్నారు.

డివిజన్ స్థాయి ఖోఖో జట్ల ఎంపిక



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఆయా గ్రామాల ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులకు డివిజన్ స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొనడానికి మంగళవారం జీవదాన్ స్కూల్‌లో సెలక్షన్ చేసినట్లు క్రీడల కన్వీనర్ రాజాగౌడ్ తెలిపారు. మండలంలోని ఆయా పాఠశాలల నుంచి ఖోఖో అండర్-14, అండర్-17 బాలుర రెండు జట్లు, బాలికలు రెండు జట్లు ఎంపిక చేశామన్నారు. ప్రిన్సిపాల్ లూసీజార్జ్, సంతోష్, రాజు, బన్సీలాల్ పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో మహిళలే కీలకం

- ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్(జుక్కల్) : దేశ అభివృద్ధికి మహిళలు, యువత కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. గర్భిణులతో పాటు చిన్న పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. మంగళవారం మహమ్మద్ నగర్ మండల కేంద్రంలోని సొసైటీ ఫంక్షన్ హాల్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్ కార్యక్రమానికి జుక్కల్ ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జయప్రదీప్, రవీందర్‌రెడ్డి, మల్లికార్జున్, సీడీపీవో సౌభాగ్య తదితరులున్నారు.



మహమ్మద్ నగర్‌లో మాట్లాడుతున్న జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

సాగర్‌లో పర్యాటకం కోసం ప్రణాళికలు

నిజాంసాగర్ (జుక్కల్) : కర్ణాటక మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాలకు సరిహద్దున ఉన్న నిజాంసాగర్ ప్రాజెక్ట్‌ను పర్యాటక కేంద్ర అభివృద్ధి కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను కోరారు. మంగళవారం సాయంత్రం జిల్లా కేంద్రంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు కలెక్టర్‌తో సమావేశమయ్యారు.సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. నిజాంసాగర్ మండలంలోని చెరువు ముందరి తండా, పిట్లం-బాన్సువాడ రహదారి పనులకు అటవీశాఖ అనుమతులు ఇవ్వాలన్నారు. పోడు భూములు సాగు చేసిన రైతులకు పట్టా పాస్‌బుక్కులు అందించాలని కోరారు. అర్హులైన వారికి రేషన్ కార్డులు అందేలా చూడాలని కలెక్టర్ కోరారు. అసన్ పల్లి గ్రామంలోని మహిళల డబ్బులు కాజేసిన బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

‘విధుల్లో నిర్లక్ష్యాన్ని సహించం’

రాజంపేట: విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ హెచ్చరించారు. మంగళవారం ఆయన రాజంపేట మండల కేంద్రంలో పర్యటించారు. పల్లె ప్రకృతి వనం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కేజీబీవీ ఆవరణలో మొక్కలు నాటారు. రాజంపేట నర్సరీ, ప్రకృతి వనాలలో పిచ్చిమొక్కలు తొలగించకపోవడంతో ఎంపీడీవో రాజేశం, ఎంపీవో రఘురాం, పంచాయతీ కార్యదర్శి అశోక్, ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయంత్రంలోగా పిచ్చిమొక్కలను తొలగించాలని ఆదేశించారు. రుణమాఫీ విషయంలో వ్యవసాయాధికారులు, బ్యాంకు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఓ రైతు కలెక్టర్‌తో పేర్కొనగా.. వెంటనే సమస్య పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా కేజీబీవీలో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి, బహుమతులు అందించారు. చక్కగా చదివి లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు.

సుడిగాలి పర్యటన

కలెక్టర్ మండలకేంద్రంలో సుడిగాలి పర్యటన చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, రోగులతో మాట్లాడి వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. ఆస్పత్రి పరిసరాలను శుభ్రం చేయించాలని ఎంపీడీవోకు సూచించారు. ఆస్పత్రి ఆవరణలో పండ్ల మొక్కలు నాటాలన్నారు. తహసీల్ కార్యాలయాన్ని సందర్శించి ప్రజలకు అందుతున్న సేవలు, ధరణి, రికార్డుల వివరాలు తెలుసుకున్నారు. మండల కేంద్రంలోని రైస్‌మిల్లును సందర్శించి సీఎంఆర్ లక్ష్యాన్ని త్వరగా చేరుకోవాలని సూచించారు. ఆయన వెంట ఆర్డీవో రంగనాథ్ రావు, జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్, తహసీల్దార్ అనిల్ కుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈవో రామస్వామి తదితరులు పాల్గొన్నారు.



పల్లె ప్రకృతి వనంలో పిచ్చి మొక్కలు పెరగడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ సంగ్వాన్

కలెక్టర్ ఆదేశాలతో కదలిక

స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మంగళవారం రాజంపేటలో పర్యటించి పల్లె ప్రకృతి వనం, నర్సరీలను సందర్శించారు. వీటిలో పిచ్చి మొక్కలు పెరగడాన్ని గమనించి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయంత్రంలోగా పిచ్చిమొక్కలను తొలగించాలన్న ఆదేశాలతో పంచాయతీ సిబ్బంది ఆగమేఘాలపై కదిలి, పిచ్చిమొక్కలను తొలగించారు.



పిచ్చిమొక్కలను తొలగించిన తర్వాత..

విద్యుత్ సమస్యలకు పరిష్కారం చూపండి

కామారెడ్డి టౌన్: తెలంగాణ రాష్ట్రంలోని ఎన్పీడీసీఎల్ పరిధిలో ఉన్నటువంటి రైతులకు విద్యుత్ సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర, జిల్లా నాయకులు హనుమకొండలోని విద్యుత్ భవనంలో టీఎస్ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి మంగళవారం కలిశారు. గ్రామాలలో ట్రాన్స్‌ఫార్మర్‌లు కాలిపోయిన ఎలాంటి సమస్యలున్న సకాలంలో సిబ్బంది సమస్యలను పరిష్కారం చేసి వ్యవసాయ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ అఖిలభారత కార్యవర్గ సభ్యుడు ముదుగంటి శ్రీధర్ రెడ్డి, దోనూరు రాము, రాష్ట్ర కార్యదర్శి ఆనందరావు, ప్రచార ప్రముఖ్ ల్యాగాల శ్రీనివాస్, నాయకులు కొమిరెడ్డి అంజన్న, వెంకట్ రెడ్డి, పోలబోయిన మురళీధర్, లెక్కల జలంధర్ రెడ్డి, అనిల్ కుమార్, శరత్ కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిలో భారీ వర్షం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డిలో మంగళవారం భారీ వర్షం కురియడంతో బీసీ కాలనీలోని పలువురి ఇళ్లలో వర్షం నీరు వచ్చి చేరింది. దీంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షం కారణంగా వరి పంట పొలాలు కూడా నేలకొరగడంతో రైతులు ఆవేదన చెందారు.

మద్నూర్(జుక్కల్) : మండల కేంద్రంలో మంగళవారం భారీ వర్షం కురియడంతో జనజీవనం పూర్తిగా స్తంభించింది. ఒక్కసారిగా ప్రారంభమైన వర్షం భారీగా కురియడంతో ఎక్కడి వారు అక్కడే ఉండిపోయారు. మండల కేంద్రంలో నాలుగు రోజులుగా వర్షం పడడంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి.

సంక్షిప్తం

సరైన ఆహారం తీసుకుంటేనే ఆరోగ్యం

బాన్సువాడ : ప్రతీ ఒక్కరు సంతులిత ఆహారం తీసుకున్నప్పుడే ఆరోగ్యంగా ఉంటామని సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. స్థానిక ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో మంగళవారం ఫుడ్‌ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన ఆహార పదార్థాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్షణలో ఆహారం పాత్ర ఎంతో ముఖ్యమైందని, చిన్నారులకు, వారి తల్లిదండ్రులకు ఆహారంపై అవగాహన కల్పించడానికి ఇలాంటి ఫుడ్ ఫెస్టివెల్ ఎంతో దొహదపడతాయని అన్నారు. మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, హెచ్ఎం లావణ్య నరేష్, నాయకులు అంజిరెడ్డి, ఎజాస్, నార్ల ఉదయ్ తదితరులున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



బాన్సువాడ : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన భోజనను అందించాలని సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మంగళవారం పట్టణంలోని కోనా బాన్సువాడ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజనం తీరును పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. కాంగ్రెస్ నేత కంసాలి రామాచారి ఇటీవల గుండెపోటుతో మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను పోచారం పరామర్శించారు. ప్రభుత్వ పరంగా అందాల్సిన సాయాన్ని అందజేయాలని తహసీల్దార్ వర ప్రసాద్‌కు సూచించారు. మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, నాయకులు అంజిరెడ్డి. ఎజాస్, కృష్ణరెడ్డి, ఖలేక్, కొయ్యగుట్ట శ్రీధర్ తదితరులున్నారు.

పెద్దకొడప్‌గల్‌లో..

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల ప్రత్యేక అధికారి కిషన్ హాస్టల్ వార్డెన్‌కు సూచించారు. మంగళవారం మండలంలోని చావని తండా గ్రామ పంచాయతీలో ఎస్టీ హాస్టల్‌ను పిరశీలించారు. భోజనం విషయంలో నిర్లక్ష్యం వద్దన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో లక్ష్మీ కాంత్ రెడ్డి, వార్డెన్ దశరత్ జీపీ కార్యదర్శి తదితరులున్నారు.

పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డలు క్షేమం

బిచ్కుంద(జుక్కల్) : పౌష్టికాహారం తీసుకుంటేనే గర్భిణీ మహిళలు, బాలింత తల్లి బిడ్డ క్షేమంగా ఉంటారని ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు అన్నారు. మంగళవారం బిచ్కుంద మున్నూర్ కాపు సంఘంలో పోషణ్ అభియాన్ కార్యక్రమం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుపేద గర్భిణులకు అంగన్‌వాడీలు ఆసరాగా ఉంటాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పీసీసీ డెలిగేట్ విఠల్‌రెడ్డి, నాయకులు గంగాధర్, రవీందర్ పటేల్, గోపాల్‌రెడ్డి సీడీపీవో కళావతి, సూపర్‌వైజర్ వినోద, వైద్య అధికారులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని కన్నాపూర్ గ్రామానికి చెందిన గాయపోయిన సురేష్‌కు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ మంగళవారం రూ. 60వేల సీఎం సహాయ నిధి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మండల నాయకులు, యుత్ నాయకులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆయన మంగళవారం మండలంలోని సోమారం తండాలో పర్యటించారు. మంచి నీటిట్యాంకులను ఎప్పటికప్పుడు కడుగుతూ శుభ్రం చేయాలన్నారు. డ్రైయినేజీలలో ఉన్న మురికి తొలగించి దోమల నివాణకు మందులను స్ప్రేచేయాలన్నారు. గ్రామంలోని రోడ్లలో గుంతలు ఏర్పడినట్లయితే వెంటనే పూడ్చి వేయాలని, లేనియెడల నీరు నిలిచి దోమలుచేరి ప్రజలు రోగాన బారిన పడే అవకాశముందన్నారు. రోడ్డుకిరువైపులా పిచ్చిమొక్కలు, చెత్తచెదారాన్ని తొలగించాలన్నారు. తండాలో నిర్వహిస్తున్న వైద్యశిబిరాన్ని పరిశీలించారు. డీఎల్‌పీవో శ్రీనివాస్, మండల ప్రత్యేక అధికారి రాజారాం, ఎంపీడీవో సయ్యద్ సాజీద్‌అలీ, ఎంపీవో సవితారెడ్డి, కార్యదర్శి అశోక్ తదితరులున్నారు.

పారిశుధ్య పనులు పక్కాగా చేయాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : గ్రామంలో నిత్యం పారిశుధ్య పనులను పకడ్బందీగా నిర్వహించాలని నాగిరెడ్డిపేట ఎంపీడీవో ప్రభాకరచారి సూచించారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం నాగిరెడ్డిపేట మండలంలోని జప్తిజాన్కంపల్లిలో చేపట్టిన పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. జీపీ కార్యాలయంలో పలురికార్డులను పరిశీలించారు. జీపీ కార్యదర్శి శంకర్, మాజీసర్పంచ్ సాయిలు ఉన్నారు.

గురుకుల పాఠశాల కోసం భవనం పరిశీలన



బీబీపేట : మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల పాఠశాల భవనం ఇరుకుగా ఉండడం, దాని వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతుండడంతో సోమవారం ప్రజావాణి కార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రులు వెళ్లి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో స్పందించిన అధికారులు మంగళవారం మండల కేంద్రంలోని ఒక ఫంక్షన్ హాల్‌ను పరిశీలించారు. గురుకుల పాఠశాలకు కావాల్సిన గదులు నిర్మించాల్సిన ఉందని, ఫంక్షన్ హాలు కేవలం హాస్టల్ కోసం మాత్రమే సరిపోతుందన్నారు. అనంతరం మరో స్థలం కూడా పరిశీలించారు. నిధులు విడుదల అయితే గదుల నిర్మాణం చేస్తామని వారు పేర్కొన్నారు. జెడ్పీ సీఈవో చంద్రానాయక్, ఆర్‌సీవో సత్యనాథ్ రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మెన్ ప్రేమ్‌కుమార్, తహసీల్దార్ సత్యనారాయణ, కార్యదర్శి రమేష్, ప్రజాప్రతినిదులు ఉన్నారు.

క్రైం కార్నర్

పాల్వంచలో గుడిసె దగ్ధం

మాచారెడ్డి: పాల్వంచ మండల కేంద్రంలో నాందేటి రమేశ్‌కు చెందిన నివాసపు గుడిసె విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంగళవారం దగ్ధమైంది. గుడిసెలో నగదు, వంట సామగ్రి, దుస్తులు కాలిపోయాయి. ఈ ఘటనతో రూ. 2.50 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితులు పేర్కొన్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారు కోరారు.

పంటలను ధ్వంసం చేసిన అడవి పందులు

లింగంపేట: మండలంలోని పర్మళ్ల గ్రామంలో రాజాగౌడ్‌కు చెందిన వరి పంటను అడవి పందులు సోమవారం రాత్రి ధ్వంసం చేశాయి. అడవి పందులు రాత్రి వేళ గుంపులు, గుంపులుగా వచ్చి పంటను ధ్వంసం చేసినట్లు బాధితుడు తెలిపాడు. సుమారు ఎకరం వరి పంట చేతికి రాకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు. వ్యవసాయాధికారులు ధ్వంసం చేసిన పంటను పరిశీలించి నష్ట పరిహారం చెల్లించాలని కోరుతున్నాడు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కామారెడ్డి క్రైం: కామారెడ్డి మండలం ఉగ్రవాయి శివారులోని మైసమ్మ ఆలయ ప్రాంతంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు మంగళవారం గుర్తించారు. మృతుని వయస్సు 35-40 ఏళ్ల మధ్య ఉంటుందని దేవునిపల్లి ఎస్సై మధుసూదన్ రెడ్డి తెలిపారు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, నీలి రంగు షర్ట్, బూడిద రంగు ప్యాంట్ కలిగి ఉన్నాడని పేర్కొన్నారు. అనారోగ్య కారణాలతో చనిపోయి ఉండవచ్చని భావిస్తున్నారు.

బస్సు నుంచి పడి విద్యార్థినికి తీవ్రగాయాలు



లింగంపేట: బస్సు నుంచి కిందికి దిగుతున్న ఓ విద్యార్థిని కింద పడి తీవ్రగాయాలైన ఘటన లింగంపేటలో మంగళవారం చోటు చేసుకుంది. లింగంపేటకు చెందిన విద్యార్థిని సంపంగి కావ్య ఎల్లారెడ్డిలోని ఓ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతోంది. కావ్య ఉదయం కళాశాలకు వెళ్లేందుకు బస్టాండులో బస్సు ఎక్కింది. బస్సు అంబేడ్కర్ చౌరస్తా నుంచి ఎల్లారెడ్డి వైపు వెళ్తుండగా కావ్య తల్లి దుర్గవ్వ సైతం ఎల్లారెడ్డి ఆస్పత్రికి వెళ్లేందుకు చౌరస్తాకు రాగా తల్లి కోసం బస్సు ఆపాలని డ్రైవర్‌ను కోరింది. అయినా బస్సు ఆపకుండా ముందుకు వెళ్లడంతో కావ్య బస్సు దిగే ప్రయత్నంలో అదుపుతప్పి ప్రమాదవశాత్తు కింద పడిపోయింది. దీంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108 అంబులెన్సులో కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

హత్యకేసులో ఇద్దరికి జీవిత ఖైదు

ఖలీల్‌వాడి: మహిళ హత్య కేసులో మరో మహిళతో పాటు ఓ వ్యక్తికి జీవిత కారాగార శిక్ష విధిస్తూ షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలపై అత్యాచారాలను నివారించే ప్రత్యేక న్యాయస్థానం స్పెషల్ జడ్జి టి శ్రీనివాస్ మంగళవారం తీర్పువెల్లడించారు. వివరాలిలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా గాంధారి మండలం ముదెల్లికి చెందిన ఒడ్నాల అంజయ్య కాశమణి భార్యాభర్తలు. అంజయ్య గాంధారి మండలం జేకే తండాకు చెందిన అరుణతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. తన భర్తకు, అరుణకు ఇది సరైంది కాదని వారికి చెప్పినా వారిలో మార్పు రాలేదు. దీంతో అరుణతో తమ కుటుంబంలో గొడవలు జరుగుతాయని భావించి కాశమణి ఆమెను అంతం చేయాలని భావించింది. అరుణ హత్యకు సాయం చేయాలని అదే గ్రామానికి చెందిన సుతారి చిన్న బాలయ్యను కాశమణి సాయం కోరింది. దీంతో అతను రూ. 5 వేలు ఇస్తే సహకరిస్తానని చెప్పాడు. వారిద్దరు పథకం ప్రకారం 2019 ఆగస్టు29న బస్సులో వెళ్తున్న అరుణను అనుసరించారు. బాన్సువాడ మండలం గాలిపూర్ గేట్ దగ్గర బస్ దిగి నిజాంసాగర్ కెనాల్ కట్టపై నడుచుకుంటూ వెళ్తుండగా మార్గమధ్యలో వారివెంట తెచ్చుకున్న తాడుతో అరుణ మెడకు బలంగా బిగించి ఊపిరాడకుండా చేసి బండరాళ్లతో తలపై మోది హత్య చేశారు. విచారణలో వీరు నేరం చేసినట్లు రుజువు కావడంతో షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల అత్యాచారాల నిరోధక చట్టం సెక్షన్ 3(2) (వి) ప్రకారం జడ్జి వారికి జీవిత కారాగార శిక్షతో పాటు రూ. వెయ్యి జరిమానా విధించించారు. జరిమానా చెల్లించకుంటే అదనంగా నెల రోజుల జైలు శిక్ష అనుభవించాలని, ఈ శిక్షలన్ని ఏకకాలంలో అనుభవించాలని జడ్జి తీర్పులో పేర్కొన్నారు.

చేపల వేటకు వెళ్లి ఇద్దరి మృతి

నవీపేట: మండలంలోని మహంతం గ్రామానికి చెందిన జాలరి భూమన్న(61) చేపలు పట్టేందుకు వెళ్లి మృతి చెందాడని ఎస్సై వినయ్ మంగళవారం తెలిపారు. రెండు రోజుల క్రితం గ్రామ శివారులోని కండసంద్రం చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లిన భూమన్న ఇంటికి తిరిగిరాలేదు. ఆచూకీ కోసం చెరువులో గాలించగా మంగళవారం ఉదయం లభ్యమైంది. కాలికి వల చిక్కుకోవడంతో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి ఊపిరాడక మృతి చెందాడన్నారు. మృతుడి కుమారుడు సుధాకర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

హున్సాలో..

బోధన్‌రూరల్: సాలూర మండలంలోని హున్స గ్రామానికి చెందిన మల్లారం సాయిలు(43) అనే జాలరీ మందర్నా శివారులోని రాంసాల చెరువులో చేపల వేటకు వెళ్లి నీట మునిగి మృతి చెందినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ తెలిపారు. సోమవారం సాయంత్రం హున్సా నుంచి మందర్న శివారులోని రాంసాల చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి తిరిగి రాలేదు.

కుటుంబీకులు మంగళవారం పలు చోట్ల గాలించగా చెరువులో మృతదేహం కనిపించింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి తల్లి ఎల్లవ్వ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యుత్‌షాక్‌తో ఏఎల్ఎంకు గాయాలు

సుభాష్‌నగర్: నగరంలోని డీ-8 నాగారం సెక్షన్‌లో ఇంద్రాపూర్ కాలనీలో డీటీఆర్(ట్రాన్స్‌ఫార్మర్)లో తలెత్తిన సమస్యను పరిష్కరించేందుకు వచ్చిన ఏఎల్ఎం నడిపి నాగన్న విద్యుత్‌షాక్‌కు గురయ్యారు. వివరాలిలా ఉన్నాయి. మంగళవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో రాత్రి విధుల్లో ఉన్న ఏఎల్ఎం లైన్‌మన్‌కు డీటీఆర్‌లో సమస్య ఉందని సమాచారమందింది. ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లిన ఏఎల్ఎం మొదట ఏబీ స్విచ్‌ను నిలిపేశారు. మరమ్మతులకు డీటీఆర్‌పైకి వెళ్లిన నడిపి నాగన్న విద్యుత్‌షాక్ తగిలి గాయపడ్డాడు. వెంటనే ఆయనను జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. విషయం తెలియగానే విద్యుత్‌శాఖ ఎస్ ఈ రవీందర్ బాధితుడిని పరామర్శించారు.

లైన్‌మన్‌పై వేటు

నగరంలోని నాగారం డీ8 సెక్షన్ లైన్‌మన్ మోహన్‌ను సస్పెండ్ చేస్తూ డీఈ శ్రీనివాస్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇంద్రాపూర్ కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ అంతరాయం ఏర్పడినట్లు సమాచారం రావడంతో ఏఎల్ఎం నడిపి నాగన్నతో అక్కడికి చేరుకున్నాడు. ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేసే క్రమంలో నడిపి నాగన్న విద్యుత్ షాక్‌కు గురై గాయాలయ్యాయి. ఈ ఘటనలో విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు లైన్‌మన్ మోహన్‌ను సస్పెండ్ చేశారు. మోహన్ గతంలో కూడా పలుమార్లు సస్పెండ్ అయినట్లు తెలిసింది.



బాధితుడిని పరామర్శిస్తున్న ఎస్ఈ రవీందర్

ఒకరిపై కేసు నమోదు

బాన్సువాడ: పట్టణంలోని ధనుంజయ్ ట్రేడర్స్ యజమానిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఆస్ట్రాల్ కంపెనీకి చెందిన పైపులను కాకుండా అదే పేరుతో నకిలీ పైపులను ధనుంజయ్ ట్రేడర్స్‌లో విక్రయిస్తున్నట్లు ఆస్ట్రాల్ కంపెనీకి ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు. దీంతో ఈ నెల 10న కంపెనీకి సంబంధించిన వ్యక్తి వచ్చి ఓ పైపును కొనుగోలు చేశాడు. సదరు వ్యక్తి కొనుగోలు చేసిన పైపును టెస్టింగ్ కోసం ల్యాబ్‌కు పంపించారు. నకిలీ పైపు అని తేలడంతో కంపెనీ ప్రతినిధులు ఈ నెల 23న బాన్సువాడ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ధనుంజయ్ ట్రేడర్స్ యాజమానిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

శనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి



రాజంపేట : ఆర్గొండ ప్రాథమిక సొసైటీ సహకార సంఘంలో అందిస్తున్న శనగ విత్తనాలను రైతుల సద్వినియం చేసుకోవాలని సొసైటీ చైర్మన్ కంది శివరాములు అన్నారు. సోమవారం సొసైటీలో శనగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. 25 కిలోలు శనగ బస్తాను రూ. 2,250 అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు బుట్ట రాజు,బాణాల మల్లారెడ్డి తదితరులున్నారు.

సీఐ బాధ్యతల స్వీకరణ



బాన్సువాడ : బాన్సువాడ సీఐగా అశోక్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పని చేసిన మున్నూరు కృష్ణను హైదరాబాద్ ఐజీ కార్యాలయానికి బదిలీ చేయడంతో ఆయన స్థానంలో నిర్మల్‌లో సీఐగా పని చేసిన అశోక్‌ను బాన్సువాడకు బదిలీ చేశారు. అశోక్ బాధ్యతలు స్వీకరించారు.

నేడు ‘చలో హైదరాబాద్’ను సక్సెస్ చేయాలి

బాన్సువాడ : బీసీ హక్కుల సాధన కోసం బుధవారం హైదరాబాద్‌లో జరిగే బీసీల మహాధర్నాను సక్సెస్ చేయాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ దత్తు అన్నారు. మంగళవారం బాన్సువాడలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బిసిల పట్ల చిన్న చూపు చూస్తోందన్నారు. ఈ సమావేశంలో బిసి విద్యార్థి సంఘం నేతలు నిఖిల్‌గౌడ్, విజయ్, రాఘవ, గోవర్ధన్ తదితరులు ఉన్నారు.

సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలి



బాన్సువాడ రూరల్ : వ్యవసాయ రంగంలో వస్తున్న సాంకేతికతను రైతులు సద్వినియోగం చేసుకుని, సాగుఖర్చులు తగ్గించుకోవాలని పద్మపాని ఎన్‌జీవో ప్రతినిధి భూపతి అన్నారు. మంగళవారం ఆయన స్వచ్ఛద సంస్థ ఆధ్వర్యంలో సంగోజీపేట్ గ్రామ రైతులకు డ్రోన్‌ల ద్వారా పంటపొలాలకు క్రిమిసంహారక మందు పిచికారి చేసే విధానాన్ని డ్రోన్ ఆపరేటర్ రంజిత్ ప్రత్యక్షంగా చూపించారు. ఒక ఎకరం వరిపంటకు పిచికారి చేయడానికి కేవలం 6నుంచి 10 నిమిషాల సమయం పడుతుందన్నారు. రైతులు రఘునాథ్ రావు, బాలరాజు ఉన్నారు.

చేనేతతో మహిళలకు స్వయం ఉపాధి



దోమకొండ : చేనేతతో యువత మహిళలు స్వయం ఉపాధి పొందాలని రాష్ట్ర చేనేత సొసైటీ అడిషనల్ డైరెక్టర్ పుగా లెంతి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన గడికోట ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపట్టిన చేనేత శిక్షణా తరగతుల రెండో బ్యాచ్‌కు ప్రారంభించి మాట్లాడారు. దోమకొండ గ్రామ పూర్వ చరిత్రలో చేనేతకు ప్రాధాన్యత ఉందన్నారు. ముఖ్యంగా చేనేత రంగంలో మహిళల సామర్థ్యాన్ని పెంపొందించాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం సుమర్థ్ పథకంను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా మండల కేంద్రంలో గడికోట ట్రస్ట్ సహకారంతో ఇప్పటికే 20 మంది మహిళలకు ఉచిత శిక్షణ ఇచ్చామన్నారు. శిక్షణ పొందే వారికి కిట్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర చేనేత సహకార సంఘం టెక్నికల్ అడ్వయిజర్ పవన్‌కుమార్, సంతోష్‌కుమార్, బాలాజీ, మండల ప్రత్యేక అధికారి జ్యోతి, ఎంపీడీవో ప్రవీన్‌కుమార్, ఐకేపీ ఏపీఎం రాజు, దోమకొండ చేనేత సహకార సంఘం అధ్యక్షుడు బొమ్మెర లక్ష్మీనారాయణ, డైరెక్టర్ బీసు రవి, మాజీ జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, మాజీ సర్పంచ్ నల్లపు అంజలి, గడికోట ట్రస్టు మేనేజర్ బాబ్జీ తదితరులున్నారు.

సిట్.. బాబు స్కిట్

లడ్డూ వివాదంపై సిట్ ఇన్‌చార్జ్‌గా అత్యంత వివాదాస్పద ఐపీఎస్ అధికారి త్రిపాఠి

చంద్రబాబు అనుకూల వాదనకు బలం చేకూర్చడమే లక్ష్యంగా ఏర్పాటు

సాక్షి, అమరావతి : అనుకున్నంతా అయ్యింది.. తిరుమల లడ్డూ ప్రసాదంపై దుష్ప్రచారం చేసి భక్తుల మనోభావాలు దెబ్బతీసిన ముఖ్యమంత్రి చంద్రబాబు మరో కుట్రకు తెరతీశారు. లడ్డూ ప్రసాదం వివాదంపై విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ పేరిట తిమ్మిని బమ్మిని చేసే కుతంత్రానికి తెరతీశారు. కోట్లాది మంది భక్తుల మనోభావాలతో ముడిపడిన ఈ అంశంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని వైఎస్సార్‌సీపీతోపాటు పలు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల డిమాండ్‌ను బేఖాతరు చేస్తూ.. తాము చెప్పినట్టుగా దర్యాప్తును ప్రభావితం చేయాలన్న లక్ష్యంతోనే సిట్‌ను నియమించారు. తానే కర్త, కర్మ, క్రియగా మారి తిరుమల లడ్డూ ప్రసాదంపై దుష్ప్రచారం చేసిన చంద్రబాబు.. ఆ కుట్రను కప్పిపుచ్చడమే లక్ష్యంగా ఈ సిట్‌ను ఏర్పాటు చేసినట్టు స్పష్టమవుతోంది. ఎందుకంటే అవాస్తవ ఆరోపణలతో తిరుమల పవిత్రతను టీడీపీ కూటమి ప్రభుత్వం దెబ్బ తీసిందన్నది బట్టబయలైంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై చేసిన ఏ ఆరోపణకు కూడా ఆధారం చూపించలేకపోయారు. నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసినట్టు ఎన్‌డీడీబీ నివేదికలో ఎక్కడా పేర్కొనలేదన్నది స్పష్టమైంది. ఇక కర్ణాటక సహకార పాడి రైతుల సమాఖ్య డెయిరీ (నందిని నెయ్యి)కి ఎందుకు కాంట్రాక్టు ఇవ్వలేదని నిలదీసేందుకు చంద్రబాబు వేసిన ఎత్తుగడ బెడిసికొట్టింది. ఎందుకంటే 2015లో అప్పటి టీడీపీ ప్రభుత్వమే తొలిసారిగా నందిని డెయిరీకి కాంట్రాక్టు ఇవ్వకుండా మహారాష్ట్రలోని ప్రైవేటు డెయిరీకి కాంట్రాక్టు కట్టబెట్టిందన్నది వెల్లడైంది. జంతువుల కొవ్వు కలిపిన నెయ్యి విపరీతమైన దుర్వాసన వస్తుందని ఆహార శాస్త్రవేత్తలు సైతం స్పష్టం చేశారు. గత ఐదేళ్లలో తిరుమల లడ్డూ ప్రసాదంపై అటువంటి ఫిర్యాదులు రాని విషయాన్ని గుర్తు చేశారు. అన్నింటికంటే ప్రధానంగా.. నెయ్యి కల్తీ జరిగినట్టు నివేదిక వస్తే టీడీపీ ప్రభుత్వం ఆహార భద్రతా చట్టం కింద కేసు ఎందుకు నమోదు చేయాలేదని నిపుణుల ప్రశ్నకు చంద్రబాబు ప్రభుత్వం


కూటమి సేవలో ఘనాపాఠి

ఎన్నికల్లో టీడీపీ అక్రమాలకు వత్తాసు పలికిన త్రిపాఠి తీరుపై 'కూటమి సేవలో ఘనాపాఠి' శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనం

ఖంగుతింది. దాంతో రాజకీయ ప్రయోజనాల కోసం తిరుమల లడ్డూ ప్రసాదానికి కళంకం ఆపాదించే కుట్ర పన్నారని సర్వత్రా ఏకాభిప్రాయం వ్యక్తమవుతోంది. లడ్డూ ప్రసాదం అంశంపై నిష్పక్షపాతంగా దర్యాప్తు నిర్వహించాలని దేశ వ్యాప్తంగా డిమాండ్ వ్యక్తమవుతోంది. మరోవైపు టీడీపీ దుష్ప్రచారాన్ని వైఎస్సార్‌సీపీ సమర్థవంతంగా తిప్పికొట్టింది. లడ్డూ ప్రసాదం అంశంపై హైకోర్టుగానీ సుప్రీంకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తితోగానీ విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది. రాజ్యసభ మాజీ సభ్యుడు, తిరుమల వ్యవహారాలపై సాధికారికత ఉన్న సుబ్రహ్మణ్య స్వామి సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. లడ్డూ ప్రసాదంపై చంద్రబాబు వ్యాఖ్యలపై విచారించాలని కోరారు. దేశ వ్యాప్తంగా హిందూ సంస్థలు, రిటైర్డ్ బ్యూరోక్రాట్లు కూడా ఈ అంశంపై నిష్పక్షపాతంగా విచారించాలని డిమాండ్ చేస్తున్నారు. దాంతో చంద్రబాబు బెంబేలెత్తారు. సిట్టింగ్ న్యాయమూర్తి ద్వారానో మరో దర్యాప్తు సంస్థ ద్వారానో విచారణ నిర్వహిస్తే తమ కుట్ర బట్టబయలవుతుందని ఆందోళన చెందారు. ఎందుకంటే చంద్రబాబు చేసిన ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను సిట్టింగ్ న్యాయమూర్తిగానీ ఇతర దర్యాప్తు సంస్థకు గానీ సమర్పించాలి. కానీ రాజకీయ ప్రయోజనాల కోసం లడ్డూ ప్రసాదంపై దుష్ప్రచారం చేసిన చంద్రబాబు ఎటువంటి ఆధారాలు చూపించ లేరు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉండేట్టుగా.. తాను చెప్పింది చేసేలా సిట్ ఏర్పాటు చేశారు.

సిట్ ఇన్‌చార్జ్‌గా వివాదాస్పద అధికారి

అత్యంత వివాదాస్పద అధికారి, ఇటీవల ఎన్నికల్లో టీడీపీ కూటమి అక్రమాలకు కొమ్ము కాశారని ఆరోపణలు ఎదుర్కొన్న గుంటూరు ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠిని సిట్ ఇన్‌చార్జ్‌గా నియమించడం పట్ల సర్వత్రా చర్చనీయాంశమైంది. ఈ బృందంలో విశాఖపట్నం డీఐజీ గోపీనాథ్ జెట్టీ, కడప ఎస్పీ హర్షవర్ధన్ రాజులను సభ్యులుగా నియమించారు. కాగా, ఎన్నికల్లో అక్రమాలకు చంద్రబాబు, దగ్గుబాటి పురందేశ్వరి పక్కా పన్నాగంతో వ్యవహరించి రాష్ట్రంలో కీలక స్థానాల్లో ఉన్న పోలీసు అధికారులపై దుష్ప్రచారం చేశారు. ఎవరెవర్ని బదిలీ చేయాలి.. ఆ స్థానాల్లో ఎవర్ని నియమించాలనే జాబితాను కేంద్ర ప్రభుత్వానికి, ఎన్నికల కమిషన్‌కు సమర్పించడం గమనార్హం. టీడీపీ కూటమి ఒత్తిడికి లొంగి ఎన్నికల కమిషన్ అప్పటి గుంటూరు రేంజ్ ఐజీగా ఉన్న పాలరాజును హఠాత్తుగా బదిలీ చేసింది. ఆ స్థానంలో చంద్రబాబు ఆదేశాలతో దగ్గుబాటి పురందేశ్వరి సూచించిన జాబితాలోని సర్వశ్రేష్ఠ త్రిపాఠిని ఐజీగా నియమించింది. అనంతరం ఉమ్మడి గుంటూరు జిల్లాలో టీడీపీ రౌడీమూకలు చెలరేగిపోయి విధ్వంస కాండ సృష్టించడం తెలిసిందే. ప్రధానంగా పల్నాడులో టీడీపీ కూటమి గుండాలు దాడులు, దౌర్జన్యాలతో బెంబేలెత్తించారు. మాచర్లలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన కుటుంబ సభ్యులపై టీడీపీ రౌడీలు దాడులు చేశారు. అప్పటి గురజాల ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కాసు మహేశ్ రెడ్డిపై దాడికి పాల్పడ్డారు. గురజాలలో బాంబు దాడులకు పాల్పడ్డారు. పల్నాడు వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఓట్లు వేయకుండా పచ్చ రౌడీలు దాడులతో విధ్వంసం సృష్టించారు. టీడీపీ ఎన్నికల అక్రమాలకు పాల్పడుతోందని వైఎస్సార్‌సీపీ నేతలు ఎంతగా ఫిర్యాదులు చేసినా సరే.. సర్వశ్రేష్ఠ త్రిపాఠి పట్టించుకోలేదు. పోలింగ్ రోజున కనీసం ఫోన్లకు కూడా స్పందించలేదు. అదీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి ట్రాక్ రికార్డ్. అంతటి వివాదాస్పద అధికారిని చంద్రబాబు ప్రస్తుతం తిరుమల లడ్డూ ప్రసాదం అంశంపై ఏర్పాటు చేసిన సిట్‌కు ఇన్‌చార్జ్‌గా నియమించడం గమనార్హం. అంటే ఇక సిట్ దర్యాప్తు ఎలా సాగుతుందో.. నివేదిక ఎలా ఉండనుందో ఊహించుకోవచ్చని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

నిబద్ధులైన అధికారులను కాదని..

సిట్ ఇన్‌చార్జ్‌గా నియమించేందుకు ఐజీలు వినీత్‌బ్రిజ్‌లాల్, పీహెచ్‌డీ రామకృష్ణ, ఆకే రవి కృష్ణల పేర్లను పరిశీలిస్తున్నట్టుగా టీడీపీ కూటమి ప్రభుత్వం మీడియాకు లీకులు ఇచ్చింది. కానీ వినీత్ బ్రిజ్‌లాల్ నిజాయితీపరుడు, ముక్కుసూటి అధికారిగా గుర్తింపు పొందారు. ఆయన తాము చెప్పినట్టుగా తప్పుడు నివేదిక ఇవ్వరని చంద్రబాబు భావించారు. టీడీపీ కూటమి ప్రభుత్వ అడ్డగోలు వ్యవహార శైలితో విసిగిపోయిన ఆయన డెప్యుటేషన్‌పై కేంద్ర సర్వీసులకు వెళ్లాలని కూడా భావిస్తున్నారు. ఇక పీహెచ్‌డీ రామకృష్ణ కూడా తాము చెప్పినట్టుగా నివేదిక ఇస్తారని చంద్రబాబుకు నమ్మకం లేదు. ఆకే రవికృష్ణ పేరు పరిశీలించారు గానీ పూర్తి నమ్మకం లేకపోవడంతో పక్కన పెట్టేశారు. అందుకే ఇటీవల ఎన్నికల్లో టీడీపీ అక్రమాలకు వత్తాసు పలికిన ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠినే సిట్ ఇన్‌చార్జ్‌గా నియమించారు. లడ్డూ ప్రసాదంపై తాము వ్యాప్తిలోకి తెచ్చిన దుష్ప్రచారానికి అధికారిక ముద్ర వేసేలా.. తిరుమల పవిత్రతకు భంగకరంగా నివేదిక ఇచ్చి సర్వభ్రష్టత్వం పట్టించాలన్న చంద్రబాబు పన్నాగంలో భాగంగానే సర్వ శ్రేష్ఠ త్రిపాఠిని సిట్ ఇన్‌చార్జ్‌గా నియమించారన్నది స్పష్టమవుతోంది.

హిందువులంతా ఏకం కావాలి

సనాతన ధర్మంపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఉపేక్షించను

- నేను పోరాటం చేయాలనుకుంటే ఆపేవారెవరూ లేరు
- హిందువులు కనీసం కోపం తెచ్చుకోకపోతే ఏం చేయగలం
- ప్రకాశ్‌రాజ్ తెలుసుకుని మాట్లాడాలి
- సెక్యులరిజం వన్‌వే కాదు టూ వే
- అల్లాహ్, జీసస్‌పైన మీరు మాట్లాడగలరా?
- ఇంద్రకీలాద్రిపై ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలు



సాక్షి, అమరావతి/ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): సనాతన ధర్మానికి భంగం వాటిల్లితే హిందువులంతా ఏకమై.. కలసికట్టుగా మాట్లాడాలని ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ అన్నారు. సనాతన ధర్మంపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. హిందువులు మౌనం వహిస్తే, ఆ మౌనం భవిష్యత్తు తరాలను నాశనం చేస్తుందన్నారు. ధర్మాన్ని పరిరక్షించడం గుడికి వెళ్లే ప్రతి హిందూ బాధ్యత కాదా, నా ఒక్కడి బాధ్యతేనా అంటూ ప్రశ్నించారు. 11 రోజుల ప్రాయశ్చిత్త దీక్షలో భాగంగా మంగళవారం విజయవాడలోని శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి ఆలయ శుద్ధి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కనక దుర్గమ్మవారి దర్శనం అనంతరం ఇంద్రకీలాద్రిపై ఆయన మీడియాతో మాట్లాడారు. తాను సనాతన ధర్మానికి సంబంధించి పోరాటం చేయాలనుకుంటే తనను ఆపేవారు ఎవరూ లేరన్నారు. ధర్మం కోసం పోరాటం చేస్తే చనిపోవడానికి సిద్ధమని, కానీ, అక్కడిదాకా తీసుకెళ్లనని చెప్పారు. సున్నితాంశాలపై నటుడు ప్రకాశ్‌రాజ్ విషయం తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. సనాతన ధర్మానికి, పవిత్రతకు భంగం కలిగినప్పుడు మాట్లాడడం కూడా తప్పే అన్నట్లు చెబితే ఎలా..? మాట్లాడేవారు ఒకటికి వందసార్లు ఆలోచించి మాట్లాడండి అని చెప్పారు. సెక్యులరిజం అనేది వన్ వే కాదని అది టూ వే అని చెప్పారు. హిందువులు మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడితే చూస్తూ ఊరుకోవాలా అని ప్రశ్నించారు. మసీదులో చిన్నపాటి చోరీ జరిగితే ఇలాగే మాట్లాడతారా అని అన్నారు. హిందూ దేవుళ్లపైన మాట్లాడేవారు అల్లాహ్ పైన, మహ్మద్ ప్రవక్తపైన, జీసస్‌పైన మాట్లాడగలరా అంటూ రెచ్చగొట్టే ప్రసంగం చేశారు. ఇస్లాంపైన మాట్లాడితే ఆ మతం వారు పెద్దఎత్తును బయటకు వస్తారు అంటూ చెప్పారు. హిందువులను రోడ్లపైకి రమ్మని చెప్పడం లేదన్నారు. కనీసం హిందువులకు కోపం రాకపోతే ఏం చేస్తామన్నారు. ఈ సందర్భంగా సినిమా ఇండస్ట్రీ వారికి కూడా విజ్ఞప్తి చేశారు. సనాతన ధర్మంపై ఇష్టానుసారం జోకులు వేయడం, మీమ్స్ చేయడం సరికాదన్నారు. ఓ సినిమా ఫంక్షన్‌లో జోకులు వేస్తున్నారని, ఎంతోమంది మనోభావాలతో ముడిపడి ఉన్న అంశాల విషయంలో జాగ్రత్తగా మాట్లాడాలని సూచించారు. దేశమంతటికీ కలిపి 'సనాతన ధర్మ రక్షణ బోర్డు'తప్పనిసరి అని చెప్పారు. చిన్నప్పటి నుంచి తాను సనాతన ధర్మం పాటించే వాడినన్నారు. తమ ఇష్టదైవం ఆంజనేయస్వామి అని, తాము రామభక్తులమని చెప్పారు. ఈ సందర్భంగా పొన్నవోలు సుధాకరరెడ్డి, భూమన కరుణాకరరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, ధర్మారెడ్డిపైన విమర్శలు చేశారు. అంతకుముందు పవన్ కళ్యాణ్‌కు ఆలయ అధికారులు, వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయం మెట్లను కడిగి, పసుపు రాశారు.

మహిళలను అడ్డుకున్న సిబ్బంది

ఆలయంలో మెట్లను పవన్‌కళ్యాణ్ శుభ్రం చేసే కార్యక్రమానికి అర్ధగంట ముందు, ఆ తర్వాత కూడా మహిళా భక్తులు మెట్ల పూజ చేసుకోకుండా ఆలయ సిబ్బంది అడ్డుకున్నారు. మెట్ల పూజ చేసుకుంటూ వస్తున్న మహిళా భక్తులను సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకుని క్యూలైన్‌లోకి పంపేందుకు ప్రయత్నించారు. దీంతో సెక్యూరిటీ సిబ్బందికి, మహిళా భక్తులకు మధ్య వాగ్వాదం జరిగింది. మెట్ల పూజ మొక్కు పూర్తి చేసుకోకుండా దర్శనానికి వెళ్లమని చెప్పడం ఎంత వరకు సబబని మహిళలు మండిపడ్డారు.

కొత్త నిబంధనలతో కలవరం!

▶ మొదటి పేజీ తరువాయి

వడ్లను కూడా రాష్ట్రాలు దాటించి సొమ్ము చేసుకుంటున్నారు. 2022 రబీ సీజన్‌కు సంబంధించిన సుమారు 60 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్‌ఎంటీ) ధాన్యాన్ని మిల్లింగ్ చేయలేదు. ఇందులో 60% ధాన్యాన్ని విక్రయించుకున్నారనే ఆరోపణలున్నాయి. ఈ పరిస్థితుల్లోనే మిల్లింగ్‌కు వచ్చిన ధాన్యాన్ని 75 రోజుల్లోనే తప్పనిసరిగా సీఎంఆర్‌గా అప్పగించాలని ప్రభుత్వం మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది.

సీఎంఆర్ పెండింగ్ ఉంటే ధాన్యం ఇవ్వరు

పైరవీలతో ఇష్టానుసారంగా ధాన్యాన్ని కేటాయింప జేసుకునే విధానానికి కూడా ఖరీఫ్ నుంచే ప్రభుత్వం చెక్ పెట్టనుంది. మిల్లు సామర్థ్యానికి అనుగుణంగా ధాన్యాన్ని కేటాయించాలని నిర్ణయించింది. ఆ మేరకు కచ్చితమైన లెక్కలను నిర్ధారించింది. ఇచ్చిన ధాన్యాన్ని ఒక్కో షిఫ్టుకు 8 గంటల చొప్పున రెండు షిఫ్టుల్లో పనిచేయడం ద్వారా 75 రోజుల్లో కేటాయించిన మొత్తం ధాన్యాన్ని మిల్లింగ్ చేయాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. అప్పటికే రెండు మూడు సీజన్ల సీఎంఆర్ పెండింగ్ ఉన్నా.. మిల్లర్ల సంఘం నాయకులతో పైరవీలు చేయించుకొని తిరిగి ధాన్యం కేటాయింప జేసుకునే విధానానికి కూడా అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వం తన మార్గదర్శకాల్లో స్పష్టంగా పేర్కొంది. మిల్లుల పని తీరును పర్యవేక్షించే బాధ్యత ఇప్పటివరకు అదనపు కలెక్టర్లకు, పౌరసరఫరాల శాఖ అధికారులకు ఉండగా, ఇక నుంచి జిల్లా కలెక్టర్లే స్వయంగా పర్యవేక్షించనున్నారు.

బ్యాంకు గ్యారంటీలు, ష్యూరిటీలు తప్పనిసరి

2021- 2022 రబీ సీజన్‌లో మిల్లులకు కేటాయించిన ధాన్యం మిల్లింగ్ కాలేదు. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత చూస్తే ఆ సీజన్‌కు సంబంధించిన ధాన్యం గానీ, డబ్బులు కానీ లెక్క తేల్లేదు. మిల్లులను తనిఖీలు చేస్తే అక్కడ ధాన్యం లేదు. చాలావరకు ధాన్యం పక్కదారి పట్టింది. రాష్ట్రంలోని 3 వేల మిల్లులకు కేటాయించిన 65 ఎల్‌ఎంటీ ధాన్యంలో సుమారు 30 ఎల్‌ఎంటీ ధాన్యం వివరాలు లేవు. ప్రస్తుతం ఆ ధాన్యాన్ని రికవరీ చేసే పనిలో ప్రభుత్వం ఉంది. ఈ నేపథ్యంలో ఇకపై ధాన్యం కేటాయించిన మిల్లుల నుంచి ఆ ధాన్యం విలువలో 25 శాతాన్ని బ్యాంకు గ్యారంటీ రూపంలో తీసుకోవడమే కాకుండా, ఇద్దరు ఆర్థికంగా ఉన్న వ్యక్తుల ష్యూరిటీ, మిల్లర్ల అసోసియేషన్ నుంచి అఫిడవిట్ రూపంలో హామీ పత్రం తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయాన్ని మిల్లర్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు సమాచారం.

ఓపెనింగ్ పేరిట ట్రాఫిక్ ఇబ్బందులు?

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని రాష్ట్రపతి రోడ్డులో ఓ షాపింగ్ మాల్ ప్రారంభానికి అధికారులు రెడ్ కార్పెట్ వేసి ఏర్పాట్లకు సహకరిస్తున్నట్లు తెలిసింది. నెహ్రూపార్క్ నుంచి రాష్ట్రపతి రోడ్డు, బస్టాండ్ వరకు రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. ఈప్రాంతంలో వస్త్ర , బంగారు , హోల్‌సేల్ , గాజుల, కూరగాయల దుకాణాలతో పాటు వివిధ రకాల షాపులు ఉండటంతో వివిధ ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో వస్తుంటారు. అయితే ఈ రోడ్డు ఇరుకుగా ఉండటంతోపాటు షాపింగ్‌మాల్ ఓపెనింగ్ నిర్వహణ రహదారిపైనే నిర్వహించడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. ఈక్రమంలో పోలీసులు వాహనాలను వీక్లీ మార్కెట్, పూసల గల్లీలకు దారి మళ్లించడానికి చర్యలు చేపట్టనున్నట్లు తెలిసింది. దీంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. అలాగే ఎమర్జెన్సీలో బోధన్ ప్రాంతం నుంచి ప్రభుత్వ ఆస్పత్రి, ఖలీల్‌వాడి ప్రాంతాలకు పేషంట్లను తరలించడానికి వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంటుంది. అంబులెన్స్ వెళ్లడానికి అవకాశం కల్పించాల్సి ఉంటుంది. దీనిపై పోలీసులు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని నగర ప్రజలు కోరుతున్నారు.

అధికారులతో నిర్వాహకుల కుమ్మక్కు..

జిల్లా కేంద్రంలో ఓ షాపింగ్‌మాల్ ప్రారంభానికి పోలీసులు రోడ్లను బ్లాక్ చేసి అనుమతులు ఇవ్వడం ఏమిటనే ప్రశ్నలు నగర ప్రజలలో వినిపిస్తున్నాయి. అలాగే ట్రాఫిక్ పోలీసులు, పోలీసులను షాపింగ్‌మాల్ నిర్వాహకులు కలిసి మామూళ్లు ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవల రాష్ట్రపతి రోడ్డులోని ఢిల్లీవాలా స్వీట్ హోమ్ వద్ద పోలీసులు నో పార్కింగ్ పెట్టి, దీనికి ఎలా అనుమతి ఇస్తారనే చర్చ నగర ప్రజల మధ్య చర్చ జరుగుతుంది. ఈక్రమంలో రేపు ప్రారంభమ్యే షాపింగ్ మాల్ ప్రారంభానికి పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి మరి.

వస్త్ర షాపింగ్ మాల్ తనిఖీ

సాక్షి ఎఫెక్ట్..

నిజామాబాద్ సిటీ: నగరంలో అనుమతులు లేకుండా విచ్చలవిడిగా వెలుస్తున్న అక్రమ నిర్మాణాలపై 'సాక్షి' దినపత్రికలో సోమవారం ప్రచురితమైన వార్త 'ఇరుకు రోడ్లలో ఇంద్రభవనాలు'కు బల్దియా అధికారులు స్పందించారు. జిల్లా కేంద్రంలోని కుమార్‌గల్లీలో ఇరుకు సందులో నిర్మిస్తున్న వస్త్ర మాల్‌ను అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారి సత్యనారాయణ నేతృత్వంలో సిబ్బంది తనిఖీలు చేపట్టారు. సంబంధిత వ్యక్తులు లేకపోవడంతో అక్కడున్న బాధ్యులకు నోటీసులు జారీచేశారు. భవన నిర్మాణానికి తీసుకున్న అనుమతులు, ఫైర్‌సేఫ్టీ సర్టిఫికెట్, సెట్‌బ్యాక్, జనరేటర్ ఏర్పాటు, పార్కింగ్‌కు కేటాయించిన స్థలం తదితర ముఖ్యమైన అంశాలపై పూర్తి వివరాలతో గడువులోగా వివరణ ఇవ్వాలని నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా టీపీవో సత్యనారాయణ మాట్లాడుతూ.. తనకంటే ముందు ఉన్న అధికారులకు భవన యజమానులు అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది. నిబంధనలు అతిక్రమించినట్లు తేలితే చర్యలు తప్పవని అన్నారు.

పంట పొలాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలి



వినతి పత్రం అందజేస్తున్న కంఠం గ్రామస్తులు

నందిపేట్(ఆర్మూర్): మండలంలోని కంఠం శివారులో గల బీసీ, ఎస్సీ కులస్తులకు చెందిన పంట పొలాలకు రోడ్డు సౌకర్యాన్ని కల్పించాలని కోరుతూ మంగళవారం ఆ గ్రామానికి చెందిన రైతులు బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. తమకు రూ.20 లక్షలు మంజూరు చేయించి పంటపొలాలకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. జిల్లా కాంగ్రెస్ నాయకులు పెంట ఇంద్రుడు, గంగా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఎంఐఎం నాయకుడి అరెస్టు

- ఆంధ్ర, ఒడిశా సరిహద్దుల్లో రూ.కోటి విలువైన గంజాయి స్వాధీనం
- మునావర్ అలీకోసం పనిచేస్తున్నామన్న నిందితులు
- జిల్లా కేంద్రంలోని ఇంట్లో తనిఖీలు
- హైదరాబాద్ నుంచి వస్తుండగా అరెస్ట్

ఖలీల్‌వాడి: ఆంధ్ర, ఒడిశా సరిహద్దులో రాష్ట్ర ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు రూ.కోటి విలువైన 319 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తొమ్మిది మందిని అదుపులోకి తీసుకొని విచారించగా, నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ఎంఐఎం నాయకుడు, కార్పొరేటర్ కుమారుడు మునావర్ అలీ తమ లీడర్ అని తెలుపడంతో ఆయన సోమవారం రాత్రి అరెస్టు చేశారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో హాజరై తిరిగి వస్తున్న మునావర్‌ను ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిజామాబాద్‌నగరంలోని ఆయన ఇంట్లో తనిఖీలు నిర్వహించగా ఎలాంటి మత్తుపదార్థాలు లభించలేదు. భద్రాద్రికొత్తగూడెంలో తొమ్మిది మంది నిందితుల నుంచి రెండు కార్లు, ద్విచక్రవాహనాలు, 10 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

15 నెలల క్రితం జైలు నుంచి బయటకి..

ఎంఐఎం నేత మునావర్ అలీ పదేళ్లుగా గంజాయి దందా చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఆయనపై మహారాష్ట్రతోపాటు జిల్లాలో కేసులుండడంతో పీడీయాక్ట్ నమోదు చేశారు. దీంతో పీడీయాక్ట్ కింద ఏడాది జైలు జీవితం గడిపారు. 15 నెలల క్రితం జైలు నుంచి వచ్చిన తర్వాత నిశ్శబ్దంగా ఉన్న మునావర్.. తాజాగా భద్రాదికొత్తగూడెం గంజాయి కేసులో ప్రధాన నిందితుడిగా అరెస్టయ్యాడు.

అర్బన్ క్రీడల్లో మామిడిపల్లి విద్యార్థుల ప్రతిభ



పీఈటీని సన్మానిస్తున్న కాంగ్రెస్ నేత వినయ్ రెడ్డి

పెర్కిట్(ఆర్మూర్): ఇటీవల ఆర్మూర్ మండలం చేపూర్‌లో నిర్వహించిన అర్బన్ క్రీడోత్సవాల్లో మామిడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పాఠశాలలో మంగళవారం నిర్వహించిన అభినందన సభలో కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను అభినందించారు. అలాగే పీఈటీ రాజేశ్వర్‌ను ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం రవీందర్, నాయకులు అయ్యప్ప శ్రీనివాస్, రవి గౌడ్, మారుతీ రెడ్డి, పండిత్ పవన్, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్ను, కౌన్సిలర్ ఆకుల రాము, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

30 నుంచి 'మండలి' ఓటరు నమోదు

నిజామాబాద్‌అర్బన్: నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, కరీంనగర్ జిల్లాల ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల పరిధిలో అర్హులైన ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకోసం ఈ నెల 30 నుంచి ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత ఎమ్మెల్సీల పదవీకాలం 2025 మార్చి 29 నాటితో ముగియనుందని, ఎన్నికల నిర్వహణలో భాగంగా అర్హులైన ఓటర్ల పేర్ల నమోదుకు అవకాశం కల్పిస్తూ ఎన్నికల కమిషన్ ఈ నెల 30న నోటీసు జారీ చేసిందని తెలిపారు. ఓటరు జాబితాలో పేర్ల నమోదు కోసం నవంబర్ 6వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో లేదా ఏఈఆర్‌ఓ కార్యాలయాల్లో నేరుగా దరఖాస్తులు చేయొచ్చని పేర్కొన్నారు. గతంలో ఓటు హక్కు వినియోగించుకున్న వారు సైతం తప్పనిసరిగా ఓటు హక్కు నమోదు చేసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. నవంబర్ 23న ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటించనున్నట్లు తెలిపారు. ముసాయిదా జాబితాపై అభ్యంతరాలుంటే నవంబర్ 23 నుంచి డిసెంబర్ 9వ తేదీ వరకు తెలియజేయాలని, 30న తుది జాబితాను వెలువరిస్తామన్నారు. కరీంనగర్ డీఆర్‌వో ఎన్నికలకు ఈఆర్‌వోగా వ్యవహరిస్తారని కలెక్టర్ తెలిపారు.

ఉత్సాహంగా డీఎస్ స్మారక టోర్నమెంట్

- వాలీబాల్, ఖోఖో పోటీలు ఉత్కంఠ భరితం

నిజామాబాద్‌నాగారం: నగరంలో నిజామాబాద్ స్పోర్ట్స్ ప్రమోషన్ సొసైటీ అధ్యక్షుడు ధర్మపురి సంజయ్ ఆధ్వర్యంలో ప్రారంభమైన డీఎస్ స్మారక మెమోరియల్ టోర్నమెంట్ ఉత్సాహంగా కొనసాగుతుంది. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తి చాటుతూ పోటీల్లో తలపడుతున్నారు. మంగళవారం ఖోఖో, వాలీబాల్ పోటీలు జరిగాయి. బుధవారం బోధన్ ఎమ్మెల్యే చేతుల మీదుగా వాలీబాల్ విజేతలకు బహుమతులు అందజేయనున్నారు. దీంతోపాటు ఖోఖో, కబడ్డీ పోటీలు జరగనున్నాయి. ప్రతినిధులు డి సాయిలు, సీనియర్ పీడీలు, పీఈటీల పర్యవేక్షణలో పోటీలు జరుగుతున్నాయి.

జూనియర్ బాలికల విభాగంలో..



కలెక్టరేట్ గ్రౌండ్‌లో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మాజీ మేయర్ సంజయ్, డీఎస్ స్మారక టోర్నీ సభ్యులు , పీఈటీలు

- వాలీబాల్‌లో విజేతగా దాస్‌నగర్ బాలికల బీసీ గురుకుల జట్టు, రన్నర్‌గా సుద్దపల్లి బాలికల గురుకుల పాఠశాల నిలిచాయి.
- సబ్‌జూనియర్‌లో విజేతగా మగ్గిడి ప్రభుత్వ పాఠశాల, రన్నర్‌గా బాల్కొండలోని పీఎంఆర్ఐబీఎస్‌లు నిలిచాయి.



ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు

బాలుర విభాగంలో..

- బాల్కొండ ప్రభుత్వ కళాశాల విన్నర్‌గా, ధర్మారం గురుకుల పాఠశాల రన్నర్‌గా నిలిచాయి.

ఖోఖో జూనియర్ విభాగంలో..

బాలుర విభాగంలో పోచంపాడ్ టీజీఆర్ఎస్ గురుకుల కళాశాల విన్నర్‌గా, చందూరు గురుకుల పాఠశాలలు నిలిచాయి.



వాలీబాల్ విజేతలతో ధర్మపురి సంజయ్, సభ్యులు, పీడీ, పీఈటీలు, విద్యార్థులు

ఆర్థిక సాయం అందజేత



వేల్పూర్: పచ్చలనడ్కుడలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన కాంగ్రెస్ నేత జాపిరి మహేశ్ కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని మంగళవారం స్థానిక కాంగ్రెస్ నేతలు అందజేశారు. కాంగ్రెస్ నేత ముత్యాల సునీల్ కుమార్ పంపించిన సహాయాన్ని మహేష్ కుమార్తెకు అందించారు.

వైకల్యాన్ని జయించిన విజేతలు



ఆర్మూర్: బధిర విద్యార్థులు వైకల్యాన్ని జయించి క్రీడా పోటీల్లో విజేతలుగా నిలవడం అభినందనీయమని సీఎస్ఐ బధిరుల ఆశ్రమ పాఠశాల మేనేజర్ సువర్ణ కిరీటి, ప్రిన్సిపాల్ శాంతమూర్తి అన్నారు. చేపూర్‌లోని క్షత్రియ హైస్కూల్‌లో ఇటీవల నిర్వహించిన క్రీడా పోటీల్లో బహుమతులు పొందిన విద్యార్థులకు అభినందన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు.